## నమస్తే తెలంగాణ

# ప్రజల తీర్పు

స్వరాష్ట్ర సాధన తర్వాత దశాబ్ద కాలానికి తెలంగాణ దారి మారింది. అభివృద్ధి మంత్రంతో, సాధించిన పనులను చూసి ఓటేయమని బీఆర్ఎస్ ప్రజలను అడిగింది. అభివృద్ధి ఫలాలు అందరి కండ్ల ముందే ఉన్నాయి. తెలంగాణ సాధించిన అభివృద్ధి, సంక్షేమాలపై దేశవిదేశాల్లో చర్చ జరుగుతున్నది. రాష్ట్రానికి అవార్డులు, రివార్డులు కూడా వరించాయి. కానీ ఎన్నికల ఫలితాలను చూస్తే అందుకు భిన్నమైన రీతిలో ఓటరు ఆలోచించినట్టు అవగతమవుతున్నది. ఈసారి ప్రజల నాడి విశ్లేషకులకు సైతం ఓ పట్టాన అందలేదు. దాంతో ఎవరికి తోచిన అంచనాలు వారు వేసుకున్నారు. అంతిమంగా ప్రజల తీర్పే ముఖ్యం. ఆ తీర్పు పర్యవసానాలపై పరిశోధనలు, విశ్లేషణలు సుదీర్ఘకాలం సాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన ఫలితాలు కూడా సామాన్యమైనవేమీ కావు. సభలో మూడింట ఒక వంతు స్థానాలు కైవసం చేసుకోవడం మామూలు విషయమూ కాదు. సుదీర్ఘకాలం పోరాట స్ఫూర్తితో పనిచేసిన ఈ పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూసింది. విఘాతాలు ఎదురైన ప్రతిసారీ నేలకు కొట్టిన బంతిలా తిరిగి లేచి తన లక్ష్యాల దిశగా అడుగులు వేసింది. ఉద్యమ నేతగా, ప్రభుత్వాధినేతగా కేసీఆర్ నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది. అసాధ్యాలను సైతం సుసాధ్యం చేసుకుంటూ, అవరోధాలను అధిగమిస్తూ ఆయన ముందుకు సాగిన విషయం తెలిసిందే. తెలంగాణను సాధించిన పార్టీగా, అభివృద్ధిలో అంగలు వేసిన ప్రభుత్వాన్ని అందించిన పార్టీగా చరిత్ర పుటల్లో బీఆర్ఎస్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నది.

తెలంగాణ ఎన్ని అవాంతరాలు, ఎన్నెన్ని గడ్డు సమస్యలను దాటింది, ఎలా ఎదిరించి సవాల్ చేసింది, ఎలా నిలిచి, గెలిచిందో మనందరికీ తెలుసు. ఎందరెందరో మహామహుల వల్ల కానిది, కలలో కూడా ఊహించలేని తెలంగాణ రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం చేసిన వ్యక్తి కేసీఆర్. రెండు విడతలు సుస్థిరమైన, సువ్యవస్థితమైన పాలన అందించారనడం నిర్వివాదాంశం. సాధించిన ప్రగతి మధ్యలో ఆగిపోకూడదు. కొన్ని మైలురాళ్లు దాటినా, ఇంకా అధిరోహించాల్సిన శిఖరాలు ఎన్నో ఉన్నాయి. మూడో విడతతో అభివృద్ధి సౌధాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ పదే పదే నొక్కిచెప్పింది. కానీ, తాజా ఎన్నికల ఫలితాలతో తెలంగాణ భవితవ్యం కొత్త మలుపు తిరిగింది. ఆ దారిలో ఏమేం ఎదురవుతాయనేది కాలమే నిర్ణయిస్తుంది. ఏదేమైనా ప్రజలే అంతిమ నిర్ణేతలు. ఆ ఎరుకతోనే తీర్పును శిరసావహిస్తామని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తాని బీఆర్ఎస్ నాయకత్వం ప్రకటించడం ప్రజాస్వామిక స్ఫూర్తికి నిదర్శనం. ఎన్నికల ఫలితాల సరళి తెలియగానే కేసీఆర్ సీఎం పదవికి హుందాగా రాజీనామా చేసి సొంత వాహనంలో ప్రగతి భవన్ నుంచి తన నివాసానికి వెళ్లిపోయారు. ఏదేమైనా ప్రజా తీర్పును అనుకూలంగా పొందిన కాంగ్రెస్‌కు అభినందనలు.

# తేడా రెండు శాతం ఓట్లే..!



**బుద్ధా మురళి**

2 శాతం అనేది స్వల్ప తేడా కావచ్చు. కానీ, అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడా చాలా పెద్దది. ఒక్క సెకన్ తేడాలోనే ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం రజతంగా మారుతుంది. ఈ ఒక్కక్షణం తేడా కోసం దశాబ్దాల కృషి ఉంటుంది. అలాగే రాజకీయాల్లో 2 శాతం తేడా కోసం ఐదేండ్ల రాజకీయం ఉంటుంది.



2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు 38 శాతం ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య 2 శాతం ఓట్ల తేడా. ఇంకా కచ్చితమైన అంకె చెప్పాలంటే కాంగ్రెస్‌కు 39.89 శాతం ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు 38.08 శాతం ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య తేడా 1.81 శాతం. ఏపీలో 2014 ఎన్నికల్లో దాదాపు ఇదేవిధంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య స్వల్ప తేడానే ఉన్నది. అదే 2018లో జరిగిన ఎన్నికల్లో లభించిన ఓట్ల శాతం చూస్తే అప్పటి టీఆర్ఎస్‌కు 46.9 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్‌కు 28.4 శాతం ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య అప్పుడు 18 శాతం ఓట్ల తేడా ఉన్నది. అప్పుడు 18 శాతం ఓట్ల తేడా వల్ల టీఆర్ఎస్‌కు 88 సీట్లలో విజయం లభిస్తే కాంగ్రెస్‌కు 19 సీట్లు లభించాయి. 2014 కన్నా టీఆర్ఎస్‌కు 25 సీట్లు పెరిగితే కాంగ్రెస్‌కు 2 సీట్లు మాత్రమే తగ్గాయి. బీజేపీ ఒక సీటుకే పరిమితమైంది.

ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో 2 పార్టీల మధ్య 2 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉన్నా కాంగ్రెస్‌కు 45 సీట్లు పెరిగాయి. బీఆర్ఎస్‌కు 49 సీట్లు తగ్గాయి. 92,35,792 ఓట్లు కాంగ్రెస్‌కు లభించగా 87,53,924 ఓట్లు బీఆర్ఎస్‌కు లభించాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 4,81,868 ఓట్లు. 2018–2023ని పోలిస్తే బీఆర్ఎస్ ఓట్లు గణనీయంగా తగ్గాయి. అదేస్థాయిలో కాంగ్రెస్ ఓట్లు పెరిగాయి. 2018లో 46 శాతం ఓట్లు తెచ్చుకున్న టీఆర్ఎస్ ఇప్పుడు 38 శాతం ఓట్లు తెచ్చుకుంది. 2018 ఎన్నికలను చూస్తే 2 పార్టీల మధ్య 18 శాతం ఓట్ల తేడా ఉన్నది. ఇది భారీ తేడా కానీ, అంచనాలకు అందనివిధంగా ఆ లోటు పూడ్చటమే కాకుండా మెజారిటీ సీట్లు సాధించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యంలో ఏదైనా సాధ్యమే. రెండు సీట్ల బీజేపీ విజయవంతంగా కేంద్రంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చి, మూడోసారి అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసుకుంది. 5 రాష్ట్రాలకు ఎన్నికలు జరిగితే 3 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడంతో దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూలమనే భావం బలపడ్డది. 3వ సారి అధికారంలోకి వస్తుందని స్టాక్ మార్కెట్ కూడా సానుకూలంగా స్పందించింది. ఈ రోజు ఒక్క రోజే స్టాక్ మార్కెట్ నిఫ్టీ 350 పాయింట్లు పెరిగింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కనీసం ఒక్క రాష్ట్రంలో బీజేపీ గెలిచినా మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుందని స్టాక్‌మార్కెట్ విశ్లేషకులు చెప్తే ఒకటి కాదు, మూడు రాష్ట్రాల్లో విజయం సాధించింది. దానితో ఈ రోజు మార్కెట్ పరుగులు తీసింది.

కర్ణాటకలో విజయం తర్వాత కాంగ్రెస్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది. కర్ణాటక విజయం ప్రభావం తెలంగాణపై కూడా చూపించింది. అయితే 5 రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఒక్క తెలంగాణలోనే విజయం సాధించగా బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించింది. మూడు రాష్ట్రాల ఎన్నికలు కాంగ్రెస్ కన్నా బీజేపీకే ఎక్కువ ప్రయోజనం కలిగించాయి. కాంగ్రెస్‌కు తెలంగాణలో విజయం వల్ల తెలంగాణలో ఉత్సాహాన్ని నింపినా మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం కాంగ్రెస్‌ను కొంత నిరుత్సాహపరిచింది. తెలంగాణలో లభించిన విజయం కాంగ్రెస్‌ను కొంతవరకు భవిష్యత్తుపై ఆశలు నిలబడేట్టు చేసింది. తెలంగాణలో విజయం సాధించి ఉండకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా నష్టం కలిగించేది.

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించిన తర్వాత రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ గెలిచిన 2వ రాష్ట్రం తెలంగాణ. తొలుత కర్ణాటకలో గెలిచారు. అయితే గెలిచిన రెండు రాష్ట్రాలు దక్షిణాదిలోనివే. ఉత్తరాదిలో మత ప్రభావం, బీజేపీ ప్రభావం ఎక్కువ. మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని చూస్తే ఉత్తరాదిలో బీజేపీ తన పట్టు కోల్పోలేదని అర్థమవుతున్నది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పార్టీ గెలిస్తే పార్లమెంట్‌లో మరో పార్టీ గెలవడం ఆనవాయితీ. ఈసారి కూడా అలాగే జరిగితే దక్షిణాదిలోనూ బీజేపీ ఎంతో కొంత ప్రభావం చూపినట్టవుతుంది.

పార్లమెంట్ ఎన్నికల కోసం దక్షిణాదిపై సైతం బీజేపీ మరింతగా దృష్టిసారించే అవకాశం ఉన్నది. ప్రజలు అందించిన విజయాన్ని తెలంగాణలో కాంగ్రెస్ నిలుపుకొంటుందా? ప్రజలు పెట్టుకున్న ఆశలను నిలబెట్టుకుంటుందా? వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్‌లో పెద్దగా కీచులాటలు కనిపించలేదు. దాదాపు ప్రాంతీయ పార్టీ నాయకుడిగా వైఎస్సార్ పాలించారు. అంతకు ముందు కాంగ్రెస్ అంటే కీచులాటలు, ముఖ్యమంత్రుల మార్పు అనేది సర్వసాధారణం. ఇప్పుడు ఎలా ఉంటుందో చూడాలి. పదేండ్ల విరామం తర్వాత మరోసారి కాంగ్రెస్ రాజకీయాలను చూడబోతున్నాం. నమ్మిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటారా? లేదా చూడాలి. నాలుగు నెలల్లో వచ్చే పార్లమెంటు ఎన్నికలు అటు కాంగ్రెస్‌కు ఇటు బీఆర్ఎస్‌కు అగ్ని పరీక్ష.

## ఓ నిరీక్షణ...



మన ఇద్దరి పొందు కోసం
ముందులాగనే పడమరకు కుంగి
సాయం చేసి సైగచేసిన భానుడు

ఓ సాయంత్రం
మబ్బుతునక విరిగి రాలినట్టుగా
తుంపర తుంపరగా కురుస్తున్న తొలిమంచు
ఇరువురి కలయికను తొందర చేస్తున్న శీతగాలులు

మన ఏకాంత గుసగుసలు వినడానికి
కీచురాళ్లు కిక్కురుమనకుండా ఉన్నవి
నీ నిశబ్దం ఇద్దరి ఆశలపై నీళ్లు చల్లింది

మొగలిపొదల మాటున
పెనవేసుకున్న స్వర్పాల జంట
సాటుగా మన సరసాన్ని చూడా
నిచేష్టమై నిలబడి చూస్తున్నాయి
నువ్వేమో సిగ్గుతో దూరం దూరం
మోహపు తీపి బాధతో మూడు హృదయాలు
పున్నమసొంటి నీ నవ్వు కోసం నేను ఆకాశం..
వేచి వేచి కనులు మూసి ఓ దీర్ఘాలోచన
పక్కుమన్న నీ నవ్వు శబ్దం
మిలమిలా వెలిగే నాలుగు కళ్లు

ఏ వేకువనో ప్రకృతికి ప్రేమ వసంతం
వెయ్యి కండ్లతో వేచి చూస్తున్న పంచభూతాలు...

-దివి

పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హిందీ బెల్టుగా పిలుచుకునే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో హస్తం పార్టీ అధికారాన్ని కోల్పోయింది. తాజా ఎన్నికల ఫలితాలు ఈ మూడు రాష్ట్రాల్లోని అనేకమంది కాంగ్రెస్ సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది.

77 ఏండ్ల కమల్‌నాథ్, 72 ఏండ్ల అశోక్ గెహ్లాట్, 76 ఏండ్ల దిగ్విజయ్ సింగ్‌లపై అతిగా ఆధారపడటమే ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ కొంప ముంచిందని చెప్పవచ్చు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో అన్నీ తామై నడిపించిన కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్, అశోక్ గెహ్లాట్ పార్టీని నట్టేట ముంచారు. ఛత్తీస్‌గఢ్‌లో సీనియర్ నేత, సీఎం సీటు కోసం భూపేశ్ భగేల్‌తో పోటీ పడ్డ టీఎస్ సింహ్ దేవ్ ఏకంగా ఓటమి పాలయ్యారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల వేళ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది.

# కాంగ్రెస్ ఓటమికి ఎన్ని కారణాలో!

కర్ణుడి చావుకు వంద కారణాలన్నట్టు.. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమికి అనేక కారణాలు ఉన్నప్పటికీ ప్రధానంగా సీనియర్ నేతల ఒంటెత్తు పోకడలు, వారసత్వ రాజకీయాలు, జూనియర్లను ఎదగకుండా అడ్డుకోవడం తదితర కారణాల వల్లే పార్టీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. దిగ్విజయ్‌సింగ్ కుమారుడు జై వర్ధన్ సింగ్ కమల్‌నాథ్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. వీరు తమ కుమారుల రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీ ప్రయోజనాలను పణంగా పెట్టినట్టు విమర్శలు వస్తున్నాయి. రెండో తరం నేతలను ఎదగకుండా అడ్డుకుంటుండటంతోనే జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కూల్చారని విశ్లేషకులు వివరిస్తున్నారు. రాజస్థాన్‌లోనూ ఇటువంటి పరిస్థితుల వల్లే ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అక్కడ కూడా వెటరన్ నేత అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ మధ్య పొసగని సంగతి తెలిసిందే. సచిన్ పైలట్ ఏకంగా సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటు ఎగురవేశారు. అవినీతి ఆరోపణలు చేస్తూ ఆందోళనలకు దిగారు. ప్రభుత్వాన్ని చీల్చేందుకు విఫలయత్నం చేశారు. ఎన్నికల వేళ కూడా ఇరువురు నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరించడంతోనే రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిందని తెలుస్తున్నది. ఛత్తీస్‌గఢ్‌లోనూ వెటరన్ నేత టీఎస్ సింహ్‌దేవ్, భూపేశ్ భగేల్ మధ్య వర్గ పోరు వల్లే ఆ రాష్ట్రాన్ని కూడా హస్తం పార్టీ కోల్పోవాల్సి వచ్చింది.

ఇంత జరిగినా సీనియర్లు తమ పట్టును వీడకపోతుండటంతో వారిని సాగనంపేందుకు కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతున్నది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ పునరుజ్జీవం కోసం కొత్త నాయకత్వాన్ని తెరపైకి తీసుకురావాలని ఆశిస్తున్నది. 1963లో అప్పటి కాంగ్రెస్ నేత కె.కామరాజ్ ప్రతిపాదించిన ప్లాన్‌ను అమలుచేయాలని చూస్తున్నది. కొత్త తరం నేతలకు సీనియర్లు నాయకత్వాన్ని బదిలీ చేయాలని సొంత పార్టీ నేతలే చెప్తున్నారు. ప్రజాదరణ కోల్పోయిన సీనియర్లకు రాజకీయ పునరావాసం కల్పించి, కొత్త వారికి మార్గం సుగమం చేసే దిశగా పార్టీలో చర్చలు జరుగుతున్నట్టు ఏఐసీసీ వర్గాలు పేర్కొన్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

ప్రముఖ రాజకీయ ఎనలిస్ట్ యోగేంద్ర యాదవ్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'కొత్త తరానికి నాయకత్వం బదిలీ చేసే సమయం ఆసన్నమైంది. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన సీనియర్లను సాగనంపి కొత్త రక్తాన్ని తెరపైకి తీసుకురావాలి. వారు వారసత్వ రాజకీయాలకు సంబంధించిన వాళ్లు కాకూడదు. కొత్త తరం అంటే యువకులని అర్థం కాదు. వారు కొత్త ఆలోచనలతో ప్రజల ముందుకురావాలి. కొత్త విజన్‌తో ప్రజల మన్ననలు పొందేవారై ఉండాలి' అని యోగేంద్ర యాదవ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే పార్టీ నష్టపోతున్నా సీనియర్లు తమ పదవులను వదిలేందుకు సిద్ధంగా లేకపోవడం శోచనీయం.

**కూటమిపై ప్రభావం ఉంటుందా?:** మరోవైపు మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి ఇండియా కూటమిపై కూడా ప్రభావాన్ని చూపిస్తున్నది. కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలతో బీజేపీకి పుంజుకునే అవకాశాన్ని కల్పించిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. పొత్తులు లేకుండానే ఒంటెత్తు పోకడలతో కాంగ్రెస్ కూటమి భవిష్యత్తును కూడా ప్రమాదంలో నెట్టేసిందని పలువురు సీనియర్లు మండిపడుతున్నారు. 'ఇది కాంగ్రెస్ ఓటమి. ఇండియా కూటమి ఓటమి కాదు' అని జనతాదళ్ (యూనైటెడ్) నేత కేసీ త్యాగి పేర్కొనడం గమనార్హం. మరోవైపు కూటమిని నడిపించేందుకు ఆప్ లాంటి పార్టీలు తహతహలాడుతున్నాయి. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి అనంతరం ఆప్ నేత ఒకరు 'ఉత్తర భారతదేశంలో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ తమదే' అని ట్వీట్ చేశారు. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన కాంగ్రెస్ ఈ నెల 6న ఇండియా కూటమి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. అయితే ఈ సమావేశానికి కూటమి కో– ఆర్డినేషన్ కమిటీ మెంబర్ అభిషేక్ బెనర్జీ గైర్హాజరు కానున్నట్టు సమాచారం. మరోవైపు కూటమిపై కాంగ్రెస్ ఓటమి ఏమాత్రం ప్రభావం చూపదని ఎన్సీపీ సీనియర్ నేత శరద్‌పవార్ ధీమా వ్యక్తం చేశారు. అయితే కూటమి భవిష్యత్తు ఏమిటనేది రానున్న నాలుగు నెలల్లో తేలిపోనున్నది.

**- ఎడిటోరియల్ డెస్క్**

## అధర్మ కాంగ్రెస్



'ఇండియా కూటమి'తో సీట్లు సర్దుబాటు చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఈ కారణంగానే మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీ ఖంగుతిన్నది. సీట్ల పంపకాలపై కాంగ్రెస్‌కు సూచనలు చేశాం. కానీ, కూటమి ధర్మాన్ని కాంగ్రెస్ పాటించలేదనేది వాస్తవం. 2024 ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సరిగా జరిగితేనే బీజేపీని గద్దె దించగలం.

**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి




# మట్టితోనే మనిషి మనుగడ



**డాక్టర్ బి.దీపక్‌రెడ్డి**
89193 96452

మనిషి నడిచేది మట్టిపైనే.. మనిషి నిలిచేది మట్టిపైనే... మనిషి పోయాక ఆయన మీద కప్పేది మట్టినే. మట్టితో మనిషి బంధం ఎనలేనిది. ఇలా... పుట్టినప్పటి నుంచి గిట్టేదాన్క మట్టితో మనిషిది విడదీయరాని బంధం.. అలాంటి మట్టిని కాపాడుకోవడం మనుష్యులుగా మన బాధ్యత.

నేడు ప్రపంచ మృత్తిక దినోత్సవం



నేడు ప్రపంచ మృత్తిక దినోత్సవం. ఒక ఆరోగ్యకరమైన నేలను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో మట్టి వనరుల సుస్థిరమైన నిర్వహణ కోసం ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చైతన్యాన్ని, అవగాహనను తీసుకురావడానికి ఒక సాధనంగా ఏటా డిసెంబర్ 5న ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ మృత్తిక దినోత్సవాన్ని జరుపుకోవాలని 2002లో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ (ఐయూఎస్ఎస్) సిఫారసు చేసింది. థాయ్‌లాండ్, గ్లోబల్ సాయిల్ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎఫ్ఏవో ప్రపంచవ్యాప్తంగా మృత్తిక దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు మద్దతు ఇచ్చింది.

2013 జూన్‌లో ఎఫ్ఏవో కాన్ఫరెన్స్ ప్రపంచ నేల దినోత్సవాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి, 68వ ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనరల్ అసెంబ్లీలో దీన్ని అధికారికంగా స్వీకరించాలని అభ్యర్థించింది. 2013 డిసెంబర్‌లో యూఎన్ జనరల్ అసెంబ్లీ మొదటి అధికారిక ప్రపంచ మృత్తిక దినోత్సవంగా 2014 డిసెంబర్ 5ను గుర్తించింది. అప్పటినుంచి ఏటాడిసెంబర్ 5న ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకొంటున్నారు.

మనిషి అవసరాలను తీర్చే సహజ వనరుల్లో నేల లేదా మృత్తికలు ముఖ్యమైనవి. మనిషికే కాదు, సకల జీవరాశులు, సూక్ష్మజీవులు సహా అన్నింటికీ ఆధారం ఈ మృత్తికలే. భూ ఉపరితలంలోని సారవంతమైన సన్నటి పొరనే నేల లేదా మృత్తిక అంటారు. భూమిపై ఉన్న రాళ్లు శిథిలం చెందడం, జంతు వృక్ష సంబంధిత పదార్థాలు కాలక్రమేణా అనేక భౌతిక రసాయనిక మార్పులకు లోనుకావడం వల్ల నేలలు ఏర్పడ్డాయి. ఒక సెంటీమీటరు మందం ఉన్న మృత్తిక ఏర్పడటానికి ఐదు నుంచి పది వేల ఏండ్ల వరకు పడుతుంది.

మృత్తికలు మనిషి జీవితంతో విడదీయరాని బంధాన్ని ఏర్పర్చుకున్నాయి. మనుష్యులు వ్యవసాయం చేయడం ప్రారంభించినప్పుడు నదీపరీవాహక ప్రాంతాల్లోని సారవంతమైన నేలల వైపు మొగ్గుచూపారు. అందుకే గొప్ప గొప్ప నాగరికతలు మంచి సారవంతమైన నేలలున్న ప్రాంతాల్లోనే విలసిల్లాయి.

**మన దేశంలోని మృత్తికలు:** ఒండ్రుమట్టి నేలలు, నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, నలుపు–ఎర్ర మిశ్రమ నేలలు, లాటరైట్ నేలలు, ఎడారి నేలలు, అటవీ నేలలు, క్షార లేదా ఆమ్ల నేలలు అనే ఎనిమిది రకాల నేలలను ఇప్పటివరకు గుర్తించారు. ఈ నేల రకాలే ఒక ప్రాంతంలో పండే పంటలను నిర్ణయిస్తాయి. తెలంగాణ విషయానికి వస్తే అత్యంత ఫలవంతమైన ఒండ్రు నేలల నుంచి నిరుపయోగమైన ఇసుక నేలల వరకు రాష్ట్రంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో 48 శాతం ఎర్ర నేలలు, 25 శాతం నల్లరేగడి నేలలు, 20 శాతం ఒండ్రు నేలలుండగా.. మిగిలినవి లాటరైట్ నేలలు. అయితే ఈ సారవంతమైన నేలలు మనిషి చర్యల వల్ల నాశనమవుతున్నాయి. విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల నేలలు తమ సహజ జవసత్వాలను కోల్పోయి నిస్సారం అవుతున్నాయి.

అంతేకాకుండా నదులు, వర్షాలు, వరదలు, గాలి లాంటి సహజ కారణాల వల్ల మెత్తని, సారవంతమైన నేలలు కొట్టుకుపోయి క్రమక్షయానికి గురవుతున్నాయి. మనదేశంలో సుమారు 175 మిలియన్ హెక్టార్లలో జరిగే ఈ క్రమక్షయం వల్ల ప్రతి సంవత్సరం 6,000 మిలియన్ టన్నుల సారవంతమైన నేలలు కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల ఏటా 30 నుంచి 50 మిలియన్ టన్నుల పంట నష్టం జరుగుతున్నది. దీంతోపాటు కొట్టుకుపోయిన ఈ మట్టి అంతా జలాశయాల్లో పూడికగా చేరి వాటి నీటి నిల్వ సామర్థ్యాన్ని 2 శాతం వరకు తగ్గిస్తున్నాయి. ఇలా జలాశయాల్లో పూడిక చేరడం వల్ల వరదల సంఖ్య కూడా పెరుగుతున్నది.

**మృత్తిక సంరక్షణకు ప్రభుత్వాల కృషి:** మృత్తిక సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తున్నది. కాంటూర్ బండింగ్, సోపాన వ్యవసాయం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, వాటర్‌షెడ్ పథకాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తున్నది. నేలల క్రమక్షయాన్ని తగ్గించడానికి మల్చింగ్, స్ట్రిప్ క్రాపింగ్ వంటి పద్ధతులను రైతులు అనుసరిస్తున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత మిగిలిన రొట్టను (పంట వ్యర్థాలు) పొలంలోనే దున్నడం ద్వారా నేలల సారాన్ని పెంచవచ్చు. మల్చింగ్ పద్ధతిలో రొట్టను పొలంలో పరిచి, పవనాల వల్ల నేలల క్రమక్షయాన్ని అరికట్టవచ్చు. స్ట్రిప్ క్రాపింగ్ పద్ధతిలో వివిధ కాల వ్యవధుల్లో కోతకు వచ్చే పంటలను వరుసల్లో పెంచుతారు. చంబల్–యమునా లోయ ప్రాంతంలో నేలల తీవ్ర క్రమక్షయం వల్ల గల్లీలు, రావైన్లు ఏర్పడి ఆ ప్రాంతమంతా 'బ్యాడ్ ల్యాండ్' భూ స్వరూపాన్ని సంతరించుకున్నది.

ఈ ప్రాంతంలో భూ వనరులను పునరుద్ధరించడానికి అక్కడి ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలుచేస్తున్నది. పంటల మార్పిడి పద్ధతి ద్వారా కూడా నేలల సారం పెంచవచ్చు. లెగ్యూమ్ జాతికి చెందిన పంటలను మార్పిడి పంటగా వాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా కాలుష్యం తగ్గడమే కాకుండా ఆక్సిజన్ లభ్యత పెరిగింది. చెట్ల సంఖ్య పెరగడం వల్ల నేల కోతకు గురికాకుండా అడ్డుకట్ట పడింది.

మట్టి లేకుండా.. హైడ్రోపోనిక్స్ వంటి సాంకేతికతను వినియోగించి పంటలు పండించవచ్చు. కానీ మానవజాతికే కాకుండా చరాచర జీవులన్నింటికీ జీవాధారమైన నేలను నాశనం చేసినవారమవుతాం. ఆ హక్కు మనకు లేదు. మనకు మెతుకును, బతుకునిస్తున్న నేలను భవిష్యత్ తరాలకు నాశనం చేయకుండా ఇవ్వగలిగినప్పుడే ఆ తరాలు మనల్ని క్షమిస్తాయి. లేదంటే భవిష్యత్తు తరాలకు తీరని ద్రోహం చేసిన వాళ్లుగా చరిత్రలో మిగిలిపోతాం.

*(వ్యాసకర్త: అధ్యాపకుడు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ)*